రహదారిపై పశువులు.. ప్రయాణికుల ఇబ్బందులు

మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై రాత్రి సంచరిస్తున్న పశువులు

భీమారం, జూలై 13 : భీమారం మండల కేంద్రంలోని మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై రాత్రి వేళలో పశువులు రోడ్లపై సంచరిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తున్నది. దీంతో తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రమాదాల్లో ప్రయాణికులతో పాటు, పశువులూ గాయాలపాలవుతున్నాయి. యాజామానులు ఇండ్లలో పశువులను కట్టేసుకోవాలని పంచాయతీ సిబ్బంది ఇప్పటికే గ్రామంలో ప్రచారం చేశారు. అయినా పట్టించుకోడం లేదని, వాహన దారులు ప్రజలు వాపోతున్నారు. అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

పేపర్ మిల్లులో ఎన్నికలు నిర్వహించాలి

కాగజ్‌నగర్, జూలై 13 : కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కో-ఆర్డినేటర్ గోలం వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేపర్ మిల్లు పునఃప్రారంభం తర్వాత పర్మినెంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోకపోగా, స్థానికేతరులను నియమించడం సరికాదని పేర్కొన్నారు. స్థానికులకు పని కల్పించాలని పలుమార్లు ఆందోళనలు చేసినా యాజమాన్యం పట్టించుకోవడం లేదని తెలిపారు. పేపర్ మిల్లులో కార్మికులకు కనీస సౌకర్యాలు లేవని ఆరోపించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగితే కార్మికులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వెంకన్న (ఫైల్)

చెన్నూర్ రూరల్, జూలై 13 : దుగ్నెపల్లి గ్రామానికి చెందిన వెయిగండ్ల వెంకన్న (47) గురువారం పురుగుల మందు తాగగా, పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. దుగ్నెపల్లి గ్రామానికి చెందిన దాగమ రాజయ్యకు పిల్లలు లేకపోవడంతో 40 ఏండ్ల క్రితం తన బంధువుల నుంచి వెంకన్నను దత్తత తీసుకున్నాడు. రాజయ్య ఆస్తి మొత్తం దత్త పుత్రుడు వెంకన్నకు చెందుతుందన్న క్రమంలో తనకు కూడా వెంకన్నకు వచ్చే ఆస్తిలో వాటా కావాలని రాజయ్య సోదరుడు రామయ్య కొన్నేళ్లుగా గొడవకు దిగుతున్నాడు. భూ వివాదం ఎటూ తేలకపోవడంతో మనస్తాపం చెందిన వెంకన్న గురువారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. శనివారం మృతి చెందాడు. వెంకన్న కొడుకు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 13 : ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామ శివారులో పేకాట స్థావరంపై శనివారం టాస్క్ ఫోర్స్ దాడులు చేశారు. పక్కా సమాచారం మేరకు దాడిచేసి, బాలు, మల్లేశ్, సత్తయ్య, పూదరి సత్యనారయణ, రవీందర్‌ను పట్టుకొని, వారి నుంచి రూ.13,800, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ గంగన్న, కానిస్టేబుల్ సంజీవ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పీరీల సందడి

రెబ్బెన, జూలై 13 : రెబ్బెన మండలంలోని పలు గ్రామాల్లో పీరీల సందడి కొనసాగుతున్నది. భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. పలు గ్రామాల్లో యువకులు పీరీలు పట్టుకొని ఆట పాటలతో నృత్యాలు చేస్తూ, వీధులు, వాడల్లో సందడి చేశారు.

గుంతలు సరే.. మొక్కలేవి?

పదిహేను రోజులుగా మొక్కల పెట్టకుండా ఖాళీగా దర్శనమిస్తున్న గుంతలు

- తాండూర్‌లో వనమహోత్సవం కోసం తవ్వించిన అధికారులు
- ఎమ్మెల్యే వస్తాడంటూ ఆర్భాటం
- తీరా రాకపోవడంతో 15 రోజులుగా వాయిదా
- గుంతలతో ప్రమాదమంటున్న ప్రజలు, ప్రయాణికులు

తాండూర్, జూలై 13 : వనమహోత్సవం అంటూ గుంతలు తవ్వారు.. ఎమ్మెల్యే వస్తున్నాడంటూ ఆర్భాటం చేశారు. ఆయన రాలేదు కదా.. మొక్కలు కూడా నటలేదు. 15 రోజులుగా ఆ గుంతలు అలాగే దర్శనమిస్తున్నాయి. అవి కూడా ఎమ్మెల్యే వస్తాడంటూ ఎదురు చూస్తున్నాయి. తాండూర్ మండలం ఐబీ నుంచి మాదారం వెళ్లే దారిలో అధికారులు 15 రోజుల క్రితం వనమహోత్సవం అంటూ గుంతలు తవ్వించారు. రాజీవ్‌నగర్, చెక్‌పోస్ట్ ఏరియా, మోడీ నగర్ వరకు దాదాపు 100 గుంతలు తవ్వించారు. మొక్కలు నాటుతారని అధికారులు, నాయకులు, ప్రజలు ఎదురు చూశారు. ఎమ్మెల్యే రాకపోవడంతో వాయిదా పడింది. ఎమ్మెల్యే వచ్చాకే మొక్కలు పెట్టేందుకు అధికారులు ఎదురు చూస్తున్నారు. ఈ లోపు ఎవరైనా ప్రమాదవశాత్తు ఆ గుంతల్లో పడితే పచ్చదనం మాట దేవుడెరుగు, కాళ్లు చేతులు విరగడం మాత్రం ఖాయం. మరి ఎమ్మెల్యే ఎప్పుడోస్తారో..? ఆ మొక్కలు ఎప్పుడు నాటుతారో..? అని పలువురు విమర్శిస్తున్నారు.

రాములు నాయక్ మాటలు హాస్యాస్పదం

- ఓరియంట్ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతిరెడ్డి

మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతిరెడ్డి

కాసిపేట, జూలై 13 : ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనియన్ మాజీ అధ్యక్షుడు రాములు నాయక్ మాటలు.. దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని గుర్తింపు సంఘం యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతి రెడ్డి విమర్శించారు. దేవాపూర్‌లో శనివారం తిరుపతి రెడ్డి మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు 6 ఏళ్లు గుర్తింపు యూనియన్‌లో కొనసాగిన రాములు నాయక్.. ఇప్పుడు రెండేళ్లకోసారి ఎలక్షన్స్ జరగాలని, ఇప్పుడున్న యూనియన్ ఐదేళ్లుగా కొనసాగుతుందని అనడం సరైందన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ఆయన కార్మికుల పక్షాన పోరాడిన దాఖలాలులేవని, ఎలక్షన్ల సమయంలోనే వస్తారని విమర్శించారు. 2019లో ఆయకు కేవలం 9 ఓట్లు మాత్రమే వచ్చాయని, ఇన్నేళ్ల చరిత్రలో ఎవరికీ ఇలాంటి తీర్పు కార్మికులు ఇవ్వలేదని పేర్కొన్నారు. లోడింగ్ కార్మికులకు నెలకు 30 నుంచి 40 మస్టర్లు దొరికేవని, ఎక్కువ మస్టర్లు వస్తున్నాయని యాజమాన్యం రాములు నాయక్‌తో మాట్లాడగా, 26 మస్టర్లకు అగ్రిమెంట్ చేయించాడన్నారు. ఇప్పుడున్న గుర్తింపు సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌రావు చేసిన పనులు అనేకమని వివరించారు. 50 మందికి వారసత్వ ఉద్యోగాలు, మృతి చెందిన కార్మిక కుటుంబాల్లో ఎప్పుడూ లేని విధంగా మహిళలకు ఉద్యోగం, 68 మందికి క్వార్టర్స్, నాణ్యమైన టిఫిన్, మెడికల్ ఇన్సూరెన్స్, ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు డీఏవీ స్కూల్ ఏర్పాటు చేయించినట్లు వెల్లడించారు. గతంలో లోడింగ్ కార్మికులకు 26 మస్టర్లు ఇప్పించామని రాములు నాయక్ అంటున్నారని, దీనివల్ల కార్మికులకు అన్యాయమే జరిగిందన్నారు. 200 మంది గ్రేడ్లు, కమ్యూనిటీ హాల్ దగ్గర నాన్‌వెజ్ భోజనాల కోసం షెడ్డు ఏర్పాటు, డీఏవీ స్కూల్‌లో సీబీఎస్‌సీ సిలబస్ కోసం కొత్త భవనం మంజూరు, వెజ్ బోర్డ్ ఉద్యోగులకు కొత్తగా 64 ఎఫ్ టైప్ క్వార్టర్స్ కట్టించడం, పాత ఎఫ్ టైప్ క్వార్టర్స్ మేజర్స్ మరమ్మతులకు మంజూరు చేయించినట్లు వివరించారు. ప్లే గ్రౌండ్‌ను, వాకింగ్ ట్రాక్, దాని చుట్టూ లైటింగ్‌తో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వడ్లూరి మల్లేశ్, అట్టెపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఎస్సీ హాస్టల్‌లో వసతులు అధ్వానం'

హాస్టల్ వద్ద మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివాజీ

మంచిర్యాల (ఏసీసీ), జూలై 13 : మంచిర్యాల కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌లో వసతులు అధ్వానంగా ఉన్నాయని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసిపేట శివాజీ విమర్శించారు. మోను ప్రకారం భోజనాలు అందించడం లేదని, తాగునీటి సౌకర్యం సరిగాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో పట్టణంలోని జాఫర్ నగర్ బాలుర హాస్టల్‌ను శనివారం ఆయన సందర్శించారు. వసతులపై ఆరా తీశారు. ఆహార వ్యవస్థ దారుణంగా ఉందని, గదులు, మూత్రశాలలు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. కలెక్టరేట్ సమీప హాస్టల్‌లోనే ఇలాంటి దుస్థితి ఉంటే, మారుమూల ప్రాంతాల వసతి గృహాల పరిస్థితి ఎలా ఉందోనని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని, స్పందించి హాస్టళ్లను సందర్శించి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్, ఇన్‌చార్జి తోట అజయ్, జిల్లా కార్యదర్శి నాగుల రాజన్న, కల్లెపల్లి నవీన్, కామెర అర్జున్, ఎరుకల నర్సింగ్, దేవరకొండ వెంకన్న, రెడ్డిమల్ల అశోక్, కనకం శ్రీనివాస్, జనగామ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ మిల్లులో ప్రమాదం

చికిత్స పొందుతున్న కార్మికుడు ఆనంద్ శ్రీ వాత్సవ్

కాగజ్‌నగర్, జూలై 13 : కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో శనివారం జరిగిన ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంట్రాక్టు కార్మికుడికి గాయాలాయ్యాయి. మిల్లులోని మూడో నంబర్ పేపర్ యంత్రం ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆనంద్ శ్రీ వాత్సవ్ కుడి చేతికి గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రైవేటు దవాఖానకు తరలించారు.

విద్యార్థికి అబాకస్‌లో పట్టా

గ్రాండ్ మాస్టర్ పట్టా అందుకుంటున్న విద్యార్థి

నస్పూర్, జూలై 13 : చేతి వేళ్ల ద్వారా గాలిలో సులభమైన రీతిలో జమ, తీసివేత, గుణకార, భాగాహారాలను అవలీలగా చేసే ఏఏఏ అబాకస్‌లో గ్రాండ్ మాస్టర్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థి జయంత్ వర్మకు అబాకస్ ఫౌండర్ అడ్లగుట్ట గంగాధర్, రివిలేషన్ హైస్కూల్ కరెస్పాండెంట్ అండ్ చైర్మన్ రాపోలు విష్ణువర్ధన్‌రావు పాఠశాలలో శనివారం గ్రాండ్ మాస్టర్ పట్టాను అందజేశారు. విద్యార్థి జయంత్ వర్మ గణిత ప్రదర్శనను చూసి ఉపాధ్యాయులు ప్రశంసించారు.

విద్యార్థులకు అవగాహన

కన్నెపల్లి, జూలై 13 : కన్నెపల్లి కేజీబీవీలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, షీ టీంపై ఎస్ఐ గంగారాం అవగాహన కల్పించారు. క్రమ శిక్షణతో శ్రద్ధగా చదువుకుంటూ ఉన్నతసాథయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలపై దృష్టి

మంచిర్యాల అర్బన్, జూలై 13 : పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెడతామని మంచిర్యాల ట్రాఫిక్ సీఐ బొంతల సత్యనారాయణ అన్నారు. బదిలీపై వచ్చిన ఆయన, శనివారం పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మా ట్లాడారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడే మెగా వైద్యశిబిరం

రామకృష్ణాపూర్, జూలై 13 : ఆర్‌హెచ్ఎస్ మ్యాక్సీక్యూర్, రాఘవేంద్ర పిల్లల దవాఖానల ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్‌లోని తవక్కల్ హై స్కూల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఎండీ జనరల్ ఫిజీషయన్, గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులు, క్రిటికల్ కేర్, జనరల్ సర్జన్, ఆర్థోపెడీషియన్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధూంధాం కళాకారుడికి సన్మానం

హాజీపూర్, జూలై 13 : ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూవ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యమగాన కోకిల అవార్డు అందుకున్నట్లు జిల్లా కేంద్రానికి చెందిన ధూంధాం కళాకారుడు మేశినేని రాజన్న శనివారం తెలిపారు. తాను చిననాటి నుంచి స్టేజీ ప్రోగ్రామ్స్‌తో పాటు, పలు టీవీ సీరియళ్లలో పనిచేశానని పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో ఆదేశాలతో కుమ్రం భీం ఆడియో క్యాసెట్‌ను జోడేఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మంత్రుల చేతులమీదుగా విడుదల చేసినట్లు తెలిపారు.

160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయిస్తున్న ఏఈ స్వర్ణలత

కాసిపేట, జూలై 13 : కాసిపేట మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగం దృష్ట్యా డీటీఆర్ ఓవర్ లోడ్, లో వోల్టేజ్ సమస్యను అధిగమించేందుకు కొండాపూర్ పరిధిలోని 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 కేవీఏ డీటీఆర్‌ని ఏర్పాటు చేసిట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీ కొని ఒకరి మృతి

మంచిర్యాల అర్బన్, జూలై 13 : మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని రైలు ఢీకొని పట్టణంలోని ఎన్టీఆర్ నగరకు చెందిన సయ్యద్ మొహరాజ్ పాషా (31) మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
TOURS & TRAVELS
★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

- వివరాలు వెల్లడించిన మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాల అర్బన్, జూలై 13 : తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడిన జాదవ్ నర్సింగ్‌ను అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని డీమార్ట్ పక్కన ఉంటున్న ఓ ట్రావెల్స్ యజమాని అబ్దుల్ రహీం.. తన కుటుంబ సభ్యులతో కలిసి 7న హైదరాబాద్ వెళ్లాడు. ఈ క్రమంలో జాదవ్ నర్సింగ్.. ఆ ఇంటి ఆవరణలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, తాళం పొగలగొట్టాడు. ఇంట్లోకి చొరబడి బీరువాలోని 5 తులాల బంగారు ఆభరణాలు, వంట గదిలోని గ్యాస్ సిలిండర్, స్టవ్‌ను దొంగిలించాడు. ఇంటికి తిరిగి వచ్చిన రహీం.. చోరీ జరిగినట్లు గుర్తించి, 9వ తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పట్టణ సీఐ, ఎస్ఐ నేరస్తుడిని ఏరియాలో అతని ఇంటి వద్ద అదువులోకి తీసుకున్నారు. జాదవ్ నర్సింగ్ కూలీ పని చేస్తుంటాడని, వ్యసనాలకు దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఏసీపీ తెలిపారు. విచారించగా, నేరం ఒప్పుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు నర్సింగ్ నుంచి రూ.3.50 లక్షల విలువ గల బంగారు ఆభరణాలు, గ్యాస్ సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు, రిమాండ్ నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపర్చినట్లు వివరించారు. త్వరితగతిన కేసు చేధించిన సీఐ బన్సీలాల్, ఎస్ఐ సనత్, సిబ్బంది సత్యనారాయణ, రాజును ఏసీపీ అభినందించారు.

ఏపీఎం ప్రకాశ్‌గౌడ్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు

ఐకేపీ కార్యాలయంలో మందు సిట్టింగ్

కన్నెపల్లి, జూలై 13 : భీమిని మండలంలోని ఇందిరా క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏపీఎం ప్రకాశ్‌గౌడ్‌తో పాటు, పెద్దపేట, చిన్న గుడిపేట గ్రామానికి చెందిన సీఏలు మద్యం సిట్టింగ్ వేశారు. స్థానికులు గమనించి, కాంగ్రెస్ నాయకులకు సమాచారం అందించారు. నాయకులతో పాటు, గ్రామస్తులు కార్యాలయానికి వెళ్లారు. వారిని గమనించిన ఏపీఎం, సీఏలు మద్యం సీసాలను బయట పడేశారు. ఈ వ్యవహారంపై వారిని నిలదీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కార్యాలయానికి చేరుకొని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై భీమిని ఎస్ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా, విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

యాదవరావ్ జన్మదిన వేడుకలు

కనక యాదవరావ్‌ను సన్మానిస్తున్న నాయకులు

జైనూర్ జూలై 13 : జైనూర్ మండల కేంద్రంలో శనివారం గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావ్ జన్మదిన వేడుకలను పలు సంఘాలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు మడావి భీంరావ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీరావు. అంబేద్కర్ అసోసియేషన్ నాయకులు కాంబ్లే అశోక్, కాంబ్లే అన్నారావ్, భారతి గ్రామర్ పాఠశాల ప్రిన్సిపాల్ పోలిపెల్లి నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

కాగజ్‌నగర్, జూలై 13 : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 నుంచి తొలి, మలి దశ ఉద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలు, అరెస్టులు, జైలు శిక్ష అనుభవించి, 1969 ఏడాది విద్య కోల్పోయి ఉద్యోగాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్త సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులకు పింఛన్, ఉచిత వైద్య సౌకర్యాలు, 250 గజాల ఇళ్ల స్థలాలు, ఉద్యమకారుల పిల్లలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యెల్లాగౌడ్, రమణయ్య, దేవయ్య, నాగేశ్వర్, కోటేశ్వర్, శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వారాహి దేవికి ప్రత్యేక పూజలు

ఆలయ ప్రాంగణంలో హోమం చేస్తున్న భక్తులు

మందమర్రి, జూలై 13 : మందమర్రి పట్టణంలోని సీఐఎస్ఎఫ్ క్యాంప్ ప్రాంగణంలో గల వారాహి దేవి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి దామోదాచార్యుల ధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు శాంతి హోమం చేశారు. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు, మహిళలు తరలివచ్చారు. ఆదివారంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని పూజారి తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

జయప్రదం చేయండి

రెబ్బెన, జూలై 13 : రెబ్బెన మండలం గోలేటిలో ఆదివారం నిర్వహించే బీజేపీ కృతజ్ఞత సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి జగన్నాథ ఓదేలు శనివారం ఒక ప్రకటనలోకోరారు. ఎంపీ గోడం నగేశ్ హాజరుకానున్న సభకు ప్రజలు, కులసంఘాల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

వాహనాల తనిఖీ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 13 : స్థానిక వివేకానంద చౌక్‌లో శనివారం సిబ్బందితో కలిసి ఎస్ఐ రాజేశ్వర్ వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. 30 మంది వాహనదారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ దత్తు, కానిస్టేబుల్ సాగర్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేయాలి'

మంచిర్యాల ఏసీసీ, జూలై 13 : మంచిర్యాలలో ఎరుకల ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచిర్యాలలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లాలో తరతరాలుగా కులవృత్తులు చేసుకుని జీవిస్తున్నామని, తమకు జీవనోపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఉపాధి రంగాల్లో వెనుకబడి ఉన్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని, ఐటీడీఏ ద్వారా రుణాలు, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. తమ జీవనోపాధి అయిన పందుల పెంపకం కోసం ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. ఈ మేరకు తీర్మానం చేశారు. జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాబు, కోనేటి రాజు, కుతాడి శ్రీనివాస్, మానుపాటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి యువతి

మంచిర్యాల ఏసీసీ, జూలై 13 : హాజీపూర్ మండలం గుడిపేటలో మతిస్థిమితం లేని యువతిని పోలీసులు శనివారం అనాథాశ్రమంలో చేర్పించారు. రోడ్డుపై తిరుగుతూ కనిపించిన యువతిని గుడిపేట బెటాలియన్ పోలీసులు గమనించి, కల్వరి యువశక్తి అనాథాశ్రమం నిర్వాహకుడు ముల్కల కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన ఇక్కడికి వచ్చి, మంచిర్యాల కల్వరి అనాథాశ్రమంలో చేర్పించారు.

ఉత్తమ సామాజిక సేవా అవార్డు

రెబ్బెన, జూలై 13 : రెబ్బెన మండలానికి చెందిన రంగు మహేశ్ గౌడ్.. మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్కే జైన్, హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ చేతుల మీదుగా ఉత్తమ సామాజిక సేవా అవార్డును అందుకున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 8వ వార్షికోత్సవం కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. కరోనా సమయం నుంచి నేటి వరకు సేవలు అందించినందుకు గాను అవార్డు లభించిందని, ఆనందంగా ఉందని రంగు మహేశ్‌గౌడ్ తెలిపారు.

అత్తను హతమార్చిన అల్లుడు

- అనంతరం గొంతు కోసుకున్న నిందితుడు
- జిల్లాలో కలకలంరేపిన ఘటన





విజయ(ఫైల్) వెంకటేశ్(ఫైల్)

మంచిర్యాల అర్బన్, జూలై 13 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలో శనివారం రాత్రి దారుణం చోటుచేసుకున్నది. అత్తనే హతమార్చిన ఘటన కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చున్నంబట్టివాడకు చెందిన నెల్లి విజయ (48)-శేఖర్ భార్యాభర్తలు. వీరికి కూతరు మాలవిక, కొడుకు ఉన్నారు. బిడ్డకు భగవంతం వాడకు చెందిన శాతం వెంకటేశ్‌తో ఆరేండ్ల క్రితం పెండ్లి చేశారు. వెంకటేశ్ ఐదేండ్ల క్రితం మార్కెట్‌లో బట్టల దుకాణం నడిపాడు. నష్టంరావడంతో ఓ డ్రైవింగ్ స్కూల్ నడిపిస్తున్నాడు. వీరికి రెండేళ్ల కొడుకు ఉన్నాడు. రెండేళ్ల నుంచి చున్నంబట్టివాడలోని అత్తామామలతో ఒకే ఇంట్లో ఉంటున్నారు. శనివారం రాత్రి డబ్బు, కుటుంబ కలహాలతో అత్తా,అల్లుడి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన వెంకటేశ్.. అత్తను కత్తితో విచక్షణారహితంగా పొడిచాడు. విజయ అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం వెంకటేశ్ గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు వెంటనే మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు తాత్కాలికంగా చికిత్స అందించి, హైదరాబాద్ రెఫర్ చేశారు. కానీ, స్థానిక ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలు పూర్తిగా తెలియాల్సి ఉంది.